TELANGANA CAPITAL
# తెలంగాణ క్యాపిటల్
నిజం.. నిజాయితీ.. నిబద్ధత
TELANGANA CAPITAL NEWS
www.telanganacapitalnews.com
హైదరాబాద్ సంపుటి : 1 సంచిక: 34 మంగళవారం, మే 14, 2024 కంప్లిమెంటరీ కాపీ పేజీలు : 4

# పోలింగ్ ప్రశాంతం..



- తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్!
- ప్రశాంతంగా తెలంగాణలో పోలింగ్
- కొడంగల్‌లో ఓటేసిన సిఎం రేవంత్ రెడ్డి
- రామ్‌నగర్‌లో గవర్నర్ దత్తాత్రేయ దంపతుల ఓటు
- చింతమడకలో ఓటేసిన కెసిఆర్ దంపతులు
- ఓటేసిన మంత్రులు,ఎమ్మెల్యేలు, అభ్యర్థులు, సినీ ప్రముఖులు
- మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ఇల్లందు, పినపాకతో పాటు
- పలు ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటలకే ముగిసిన పోలింగ్
- ఏపీలోని రంపచోడవరం, అరకు, పాడేరులో సేమ్ సీన్
- అప్పటికే క్యూలైన్లలో ఉన్నవారికి ఓటేసేందుకు అవకాశం
- మధ్యాహ్నం వరకు 40.13 శాతం నమోదు..!



## 64.87 శాతం పోలింగ్ నమోదు...

హైదరాబాద్,మే13: తెలంగాణ వ్యాప్తంగా 17లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 40.13 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఉదయం వాతావరణం కొంత ప్రశాంతంగా చల్లగా ఉండడంతో ఓటర్లు వెంటనే బయటకు వచ్చి ఓటేశారు. ప్రముఖులంతా ముందే వచ్చి ఓటేశారు. చింతమడకలో కెసిఆర్, రామ్‌నగర్‌లో దత్తాత్రేయ, జూబ్లీహిల్స్‌లో సినీ ప్రముఖులు, కొడంగల్‌లో సిఎం రేవంత్ రెడ్డి, ఆయా ప్రాంతాల్లో మంత్రులు, అభ్యర్థులు ఓటేశారు. ప్రజలు కూడా గతంతో పోలిస్తే కొంత ఆసక్తిగా ముందుకు వచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మంత్రులు తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నా రు. ఖమ్మం జిల్లా మధిరలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నల్లొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో పొన్నం ప్రభాకర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు అనేది సామాన్యుల స్వరమని.. పాలకులని ప్రశ్నించేందుకు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని నేతలు సూచించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలంటే మతతత్వానికో, ప్రాంతీయతత్వానికో, కులతత్వానికో, ఇతరాత్ర ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిపై సీఈవో వికాస్ రాజ్‌కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఓటు వేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ పేరును ప్రస్తావించడంపై కాంగ్రెస్ అభ్యంతరం తెలిపింది.

## ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్,మే,13: సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు కొడంగల్‌లోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు.

### రాష్ట్రంలో మాదిరిగానే దేశంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు
## ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి సీతక్క

ములుగు ,మే,13: సోమవారం మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంత్రి సీతక్క తన స్వగ్రామం ములుగు మండలం లోని జగ్గన్న పేట గ్రామం లో ఓటు వేసి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిరిగానే దేశం లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు అని, కులాల మధ్య, మతాల మధ్య, చిచ్చు పెట్టి ఓట్లు దండుకోవాలని చూసే పార్టీలకు ప్రజలు తమ ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు. దేశంలో ఇప్పుడున్న ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని అంటున్నారని అన్నారు. ప్రజలు గమనించాలి దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుంది, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుంది అని, ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా,మండల గ్రామ నాయకులు కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.



# దాణా కుంభకోణంలో దోషి..
## ముస్లిం రిజర్వేషన్లను సమర్థిస్తున్నాడు - లాలూపై మోడీ ఫైర్..



న్యూఢిల్లీ,మే,13: ఇటీవల ముస్లిం రిజర్వేషన్లపై ఆర్జేడీ నేత, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ చేసిన వ్యాఖ్యలపై ప్రధాన మంత్రి నరేంద్రమోడీ విరుచుకుపడ్డారు. బీహార్‌లో జంగిల్ రాజ్‌ని తీసుకువచ్చిన వ్యక్తి,దాణా కేసులో నిందితుడైన వ్యక్తి దళితులు,వెనకబడిన వారి రిజర్వేషన్లను ముస్లింలకు ఇవ్వాలని వాదిస్తున్నాడని ఎద్దేవా చేశారు. హాజీపూర్‌లో ఈరోజు జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ మాట్లాడారు. ఎన్నికలను ప్రజాస్వామ్యానికి పెద్ద పండగా అభివర్ణించిన మోడీ, ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటేయాలని కోరారు. ఆర్జేడీ,కాంగ్రెస్ ప్రాధాన్యత ప్రజలు కాదని, వారి సొంత ఓటు బ్యాంకు అని ఆరోపించారు. ఆర్జేడీ కాంగ్రెస్ పార్టీలు బుజ్జగింపులనే తమ అస్త్రాలుగా చేసుకున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. దాణా కుంభకోణంలో దోషిగా తేలిని వ్యక్తి ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని అడుగుతున్నాడని అన్నారు. మోడీ జీవించి ఉన్నంత కాలం రిజర్వేషన్లను దోచుకోలేరని చెప్పారు. మీరుమహిళా రిజర్వేషన్లకు సంబంధించి పేపర్లను చించేసిన కాలం పోయిందని ప్రధాని అన్నారు. అంతకుముందు మే 7వ తేదీని లాలూ మాట్లాడుతూ.. ముస్లింకోటాకు మద్దతుగా నిలిచారు. ముస్లింలకు పూర్తిగా రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. బీహార్‌ని ముందుకు తీసుకెళ్లాల్సిన ఆలోచన ఆర్జేడీ, కాంగ్రెస్‌లకు లేదని ప్రధాని ఆరోపించారు.

### ఏజ్ లిమిట్ అమలు చేస్తే...
## ఎవరు ప్రధానినో తేల్చుకోండి..
### ఈ ఎన్నికలు తమ వందరోజుల పాలనకు రెఫరెండం: సీఎం రేవంత్

కొడంగల్,మే 13: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 33.5 శాతం ఓట్లు వచ్చాయని.. ఈ ఎన్నికల్లో అంతకు మించివస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు తమ వందరోజుల పాలనకు రెఫరెండమని తెలిపారు. బీజేపీ కూడా ఈ ఎన్నికలు మోదీ పాలనకు రెఫరెండం అని చెబుతోందన్నారు. సెప్టెంబర్ 17, 2025తో మోదీ 75 ఏళ్లు నిండుతాయని.. ఏజ్ లిమిట్ అమలు చేస్తే ఎవరు ప్రధాని అనేది బీజేపీ తేల్చుకోవాలని హితవుపలికారు. దేశంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని స్పష్టం చేశారు.





### ఎమ్మెల్యే చెంప చెళ్లు మనిపించిన ఓటరు
### మొదట ఓటర్ పై చెయ్యిజేసుకున్న ఎమ్మెల్యే

హైదరాబాద్ : గుంటూరు జిల్లా తెనాలిలో వైసీపీ ఎమ్మెల్యే, ఆ పార్టీ ప్రస్తుత అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్కు చేదు అనుభవం ఎదురైంది. శివకుమార్ క్యూలో వెళ్లకుండా నేరుగా వెళ్లడంపై ఓటరు అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఆగ్రహా నికి గురై శివకుమార్ ఓటరు చెంపపై కొట్టారు. దీంతో ఓటరు కూడా తిరిగి ఎమ్మెల్యే చెంపపై కొట్టాడు. అనంతరం ఎమ్మెల్యే అనుచరులు అతడిని చితకబాదారు. ఈ ఘటనతో కాసేపు పోలింగ్ ఆగిపోయింది.

### చింతమడకలో
## ఓటు వేసిన కేసీఆర్...

హైదరాబాద్,మే,13: బీఆర్‌ఎస్ చీఫ్, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్వగ్రామమైన చింతమడకలో గులాబీ బాస్ ఓటు వేశారు. చేతి కర్ర సహాయంతో పోలింగ్ బూత్ కు వచ్చిన కేసీఆర్ వెంట హరీష్ రావు, స్థానిక బీఆర్‌ఎస్ నేతలు ఉన్నారు. కేసీఆర్‌ను చూసేందుకు పోలింగ్ బూత్ వద్ద ప్రజలు ఆసక్తి చూపారు. కొంత మంది సెల్ ఫోన్లతో కేసీఆర్‌ను ఫొటో తీసుకున్నారు. కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్ నందినగర్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే తెలంగాణలో తొలి రెండు గంటల్లో 9.48 శాతం పోలింగ్ నమోదైంది. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలింగ్ బాగా జరుగుతోంద న్నారు. 65 శాతానికి మించి పోలింగ్ జరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత దేశంలో ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర అవుతుందని పేర్కొన్నారు.



### ఓట్ హక్కు వినియోగించుకున్న
## తీన్మార్ మల్లన్న

హైదరాబాద్ : సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్, నల్గొండ, ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఓట్ వేశారు. ఈ సందర్భంగా ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం, మాదాపురం, స్వగ్రామంలో ఉన్న పోలింగ్ బూత్ లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.





### ఈసీ నిబంధలనలు
## తుంగలో తొక్కిన సీయం రేవంత్
### పోలింగ్ వేళ ఫైర్ అయిన బీజేపీ అభ్యర్థి డీకే అరుణ..

హైదరాబాద్,మే,13: పోలింగ్ కొనసాగుతున్న సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమంటూ డీకే అరుణ మండిపడ్డారు. ఎన్నికలు జరుగుతున్న ఈ సమయంలో.. మోడీని తిట్టడం, రాజకీయాలు మాట్లాడటం ఈసీ నిబంధలనలు తుంగలో తొక్కడమే అంటూ ఎద్దేవా చేశారు. ఈ విషయం పై ఇప్పటికే స్టేట్ ఈసీ, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఒక రాష్ట్రానికి సీఎం స్థాయి లో ఉంది కూడా.. ఈ విషయం తెలుసుకోకపోవడం అవగాహనా రాహిత్యమే అంటూ పంచ్ లు వేశారు.



### హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి
## మాధవీలతపై కేసు నమోదు..

- పోలింగ్ బూత్‌లోకి వచ్చి బుర్ఖా వేసుకున్న మహిళల ఐడీ ప్రూఫ్ చెక్ చేసిన మాధవీలత
- మాధవీలతపై కేసు నమోదు చేసిన మలక్‌పేట పోలీసులు
- హిజాబ్ తొలగించి చూపించాలని కొంతమందిని కోరిన మాధవీలత

హైదరాబాద్,మే,13: హైదరాబాద్ లోక్ సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలతపై కేసు నమోదయింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ కేసు నమోదయింది. మాధవీలత పోలింగ్ బూత్‌లోకి వచ్చి బుర్ఖా వేసుకున్న మహిళల ఐడీ ప్రూఫ్ చెక్ చేశారు. హిజాబ్ తొలగించాలని చెప్పి వారి ఐడీలను ఆమె చెక్ చేశారు. దీంతో ఆమె అనుచితంగా ప్రవర్తించారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు.



# యూపీలో దుండగుల కాల్పులకు విలేఖరి బలి



ఉత్తరప్రదేశ్ షాగంజ్ ఏరియాలో 43 ఏళ్ల పత్రికా విలేఖరి అశుతోష్ శ్రీవాస్తవను సోమవారం ఉదయం గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపారు. శబర్‌హాడ్ గ్రామానికి చెందిన అశుతోష్ సోమవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఇమ్రాన్‌గంజ్ మార్కెట్‌కు వెళ్తుండగా జాన్‌పూర్ షాగంజ్ రోడ్డులో ఈ దాడి జరిగిందని షాగంజ్ సర్కిల్ ఆఫీసర్ అజిత్‌సింగ్ చౌహాన్ వెల్లడించారు. తనకు రక్షణ కల్పించాల్సిందిగా అశుతోష్ నెల రోజుల క్రితం పోలీస్‌లను అభ్యర్థిస్తూ లేఖ రాశారని, కానీ పోలీస్ అధికారులు పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ హత్యకు నిరసనగా స్థానికులు రోడ్డును దిగ్బంధం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తామని అధికారులు హామీ ఇచ్చిన తరువాత నిరసన విరమించడమైంది. ఆ ప్రాంతంలో గోవధకు వ్యతిరేకంగా శ్రీవాస్తవ వార్తలు రాయడమే ఈ హత్యకు కారణంగా స్థానిక జర్నలిస్టులు ఆరోపించారు. స్మగ్లర్ల నుంచి అనేక సార్లు అశుతోష్‌కు బెదిరింపులు వచ్చాయని, దీనిపై పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడని చెప్పారు. దుండగులను పట్టుకోడానికి పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేస్తామని ఎస్‌పి అజయ్ పాల్ శర్మ చెప్పారు. జాన్‌పూర్ పత్రకార్ సంఘ్ ఈ హత్యను ఖండించింది. వీలైనంత త్వరలో హంతకులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసింది. అశుతోష్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరింది. పోలీస్‌ల నిర్లక్షం వల్లనే అశుతోష్ హత్య జరిగిందని బాధ్యులైన పోలీస్‌లపై చట్టపరమైన చర్య తీసుకోవాలని జర్నలిస్ట్‌ల సంఘం డిమాండ్ చేసింది.

# ఈవీఎంల స్టోరేజీ గిడ్డంగిలో 45 నిమిషాలు నిలిచిపోయిన సీసీటీవీలు

ముంబై: మహారాష్ట్రలోని బారామతి లోక్‌సభ నియోజకవర్గంలో ఈవీఎంల భద్రతపై ఆ నియోజకవర్గం ఎన్‌సీపీ(ఎస్‌పీ) అభ్యర్థి సుప్రియా సూలే ఆందోళన వ్యక్తం చేశారు. ఓటింగ్ అనంతరం ఈవీఎంలు భద్రపరచిన గిడ్డంగిలో సోమవారం ఉదయం 45 నిమిషాల పాటు సీసీటీవీలను స్విచ్ఛాఫ్ చేశారని ఆమె ఆరోపించారు. బారామతి నియోజకవర్గంలో సుప్రియా సూలేపై ఆమె కజిన్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భార్య సునీతా పవార్ పోటీ చేస్తున్నారు. సుప్రియ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నికల ప్రతినిధులను, అధికారులను, జిల్లా యంత్రాగాన్ని సంప్రదించినా సంతృప్తికరమైన జవాబు రాలేదని, ఈవీఎంలు ఉంచిన ప్రాంతంలో టెక్నీషియన్లు కూడా అందుబాటులో లేరని ఆమె తెలిపారు.




# హైదరాబాద్‌లో ఓటర్లు దూరం దూరం



ఇక అయిదు గంటల వరకు అందిన సమాచారం ప్రకారం పోలింగ్ శాతం వివిధ జిల్లాలలో పోలింగ్ సరళి చూసినట్లయితే ఎప్పటిలానే హైదరాబాద్, మల్కాజీగిరి , సికింద్రాబాద్ ప్రజలు ఓటింగ్ కు దూరంగానే ఉన్నారు..కనీసం 40శాతం మంది ఓటర్లు కూడా పోలింగ్ కేంద్రాల వైపు చూడలేదు.ఇక మిగిలిన 14లోక్ సభ స్థానాలలో 60 శాతం ఓటింగ్ నమోదు కావడం విశేషం.. సాయంత్రం అయిదు గంటల వరకు ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో 69.81 శాతం, నాగర్‌కర్నూల్ పరిధిలో 66.53 శాతం, జహీరాబాద్ పరిధిలో 71.91 శాతం, భువనగిరిలో 72.34, చేవెళ్లలో 53.15 శాతం, హైదరాబాద్‌లో 39.17 శాతం, కరీంనగర్‌లో 67.67 శాతం, ఖమ్మంలో 70.76 శాతం, మహబూబాబాద్‌లో 61.00, మహబూబ్‌నగర్‌లో 68.60 శాతం, మెదక్‌లో 71.33 శాతం, మల్కాజ్‌గిరి పరిధిలో 46.27 శాతం, నల్లగొండలో 70.36 శాతం, నిజామాబాద్‌లో 67.96 శాతం, పెద్దపల్లిలో 63.86 శాతం, సికింద్రాబాద్‌లో 42.48, వరంగల్ పరిధిలో 64.08 శాతం పోలింగ్ నమోదైంది.

# దాడులు, హత్యాయత్నాలతో ఓటమిని జగన్ ఒప్పుకున్నారు: చంద్రబాబు



ఏపీలో పోలింగ్ కొనసాగుతున్న తీరుపై టీడీపీ అధినేత చంద్రబాబు టిట్టర్ ద్వారా స్పందించారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వైసీపీ అడ్డంకుల్ని అధిగమించి మరీ ప్రజలు ఓటింగులో పాల్గొనడం అభినందనీయం అన్నారు. మండుటెండలను లెక్కచేయకుండా ప్రజలు ఓటింగ్ లో పాల్గొంటుండడం హర్షణీయమని వెల్లడించారు. ఇక, ఓటమి భయంతో మాచర్ల, రైల్వేకోడూరు, పుంగనూరులో వైసీపీ పేట్రేగిపోయిందని చంద్రబాబు మండిపడ్డారు. "సిరా చుక్క పడాల్సిన చోట రక్తపు చుక్కలు పడేలా చేశారు. క్యూలైన్‌లో రమ్మన్నందుకు తెనాలిలో అన్నాబత్తుని శివకుమార్ దాడి దుర్మార్గం. దాడులు, దౌర్జన్యాలతో ప్రజాభిప్రాయాన్ని మార్చలేరన్నారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు వైసీపీ వ్యతిరేక పవనాలు స్పష్టంఓటమి ఖాయమని నిర్ధారణ కావడంతో అల్లర్లకు తెగబడుతున్నారు. ఐదేళ్ల దౌర్జన్యకాండను ఎన్నికల వేళ కూడా కొనసాగిస్తున్నారు. దాడులు, హత్యాయత్నాలతో ముందస్తుగానే ఓటమిని ఒప్పుకున్నారు. పుంగనూరు, మాచర్ల, రైల్వేకోడూరు, మైదుకూరు, ఆముదాలవలస, తాడికొండలో కూటమి ఏజెంట్లపై దాడి దుర్మార్గం. తక్కెల్లపాడు పోలింగ్ స్టేషన్లో ఎస్సీ మహిళలపైకి ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్య కారుతో దూసుకు రావడం హేయం. బాధ్యులపై ఎన్నికల కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలి. పోలింగ్ ప్రారంభమైనప్పటికీ జగన్ రెడ్డి పేరుతో ఓటర్లకు ఐవీఆర్ఎస్ కాల్స్ వస్తున్నాయి. యర్రగొండపాలెంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించారు. నరసరావుపేటలో ఎంపీ అభ్యర్థి కృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి వాహనాలపై దాడి చేశారు. తాడిపత్రిలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఆయన కుమారుడు ఓటర్లను బెదిరించారు. ఆముదాలవలసలో తమ్మినేని సీతారాం అర్ధాంగి రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. పోలింగ్ ప్రక్రియకు అంతరాయం కలిగిస్తున్న వారిపై ఎన్నికల కమిషన్‌లు చర్యలు తీసుకోవాలి" అంటూ చంద్రబాబు పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు ఎంత పెద్దఎత్తున ఓటర్లు పోలింగ్ స్టేషన్లలో ఉన్నారో... పోలింగ్ ముగిసే ఈ సమయంలో కూడా అంతే ఉత్సాహంగా ఓట్లు వేస్తున్నారు. ప్రజలు ఓటింగ్ పై ఇంత ఉత్సాహం చూపడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామం. ఆ వర్గం ఈ వర్గం అని లేదు. అన్ని వర్గాలు వచ్చి ఓటేస్తున్నారు. ఆ ప్రాంతం ఈ ప్రాంతం అని లేదు. అన్ని ప్రాంతాల్లో అదే జోరు కనిపిస్తోంది. మాచర్ల, నర్సారావుపేట వంటి చోట్ల ఓటమి భయంతో వైసీపీ హింసకు పాల్పడింది. తాడిపత్రిలో ఏకంగా ఎస్పీ వాహనం పైనే వైసీపీ గూండాలు దాడి చేశారు. అదే విధంగా నర్సారావుపేట లోక్ సభ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, అసెంబ్లీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబు వాహనాలపై దాడికి పాల్పడ్డారు. మరోవైపు తెనాలిలో వైసీపీ ఎమ్మెల్యే ఓటరుపై చేయి చేసుకున్నారు. ఇంత స్థాయిలో హింస జరిగినా ప్రజలు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఇంకా పోలింగ్ కేంద్రాలకు వస్తూనే ఉన్నారు వారందరికీ అభినందనలు అని అన్నారు చంద్రబాబు

## తాడిపత్రిలో రణరంగం... పోలీసులు అదుపులో ఎమ్మెల్యే

తాడిపత్రి టౌన్ : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తాడిపత్రి రణరంగంగా మారింది. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాళ్ల వర్షం కురిపించుకున్నారు. రాళ్ల దాడిలో ఇద్దరు పోలీసులకు, యువర్ వర్గాలకు చెందిన ఇరువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే..ఓం శాంతి నగర్ కాలనీలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూతు వద్ద ఘర్షణ చోటుచేసుకుందని తెలుపడంతో ఎమ్మెల్యే తనయుడు హర్షవర్ధన్ రెడ్డి పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్నారు. అనంతరం టిడిపి అభ్యర్థి జేసీ అస్మిత్ రెడ్డి , జేసీ ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఒకరి తర్వాత ఒకరు పోలింగ్ బూత్ వద్దకు వెళ్లే తరుణంలో టిడిపి అభ్యర్థి వైసీపీ అభ్యర్థి ఇరువురు ఒకరికొకరు ఎదురుపడటంతో ఇరు వర్గాలు కేకలు వేసుకుంటూ ఒకరిపై ఒకరు రాళ్ల దాడులకు పాల్పడ్డారు.

# అంతా నిశ్శబ్దం... బోసిపోయిన హైదరాబాద్




హైదరాబాద్: నిత్యం కిక్కిరిసి పోయో హైదరాబాద్ ఎన్నికల వాతావరణంతో బోసిపోయింది. నిశ్శబ్ద వాతావరంలో ప్రజాజీవనం సాగింది. నిలిచి పోయిన వాహనాలు, ఆగిపోయిన పరిశ్రమల చక్రాలు,అధికారిక బంద్ పాటించిన వ్యాపారవాణిజ్యాలతో భాగ్యనగరం వన్నెతగ్గింది. దీనికి ప్రధానకారణం ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి హైదరాబాద్ నుంచి సొంత గ్రామాలకు ప్రజలు తరలి వెళ్లడంతో ఈ వాతావరణం ఆవిష్కృతమైంది. రాష్ట్రంలోని హైదరాబాద్ తో పాటు ప్రధాన పట్టణాల్లో రహదారులు బోసిపోయాయి. వాహనాలు హోరు, జోరు కనిపించలేదు. రోడ్లపై వాహనాలు లేకపోవడంతో రహదారులు నిర్మానుష్యంగామారాయి. హైదరాబాద్ లోని ప్రధాన కూడలిల్లో అప్రకటిత కర్ఫ్యూ ప్రకటించినట్లుగా ఉంది. ఉపాధి, ఉద్యోగాలతో హైదరాబాద్‌లో స్థిరపడిన లక్షలాది మంది తోపాటుగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలసకూలీలు తమఓటు హక్కును వినియోగించుకోవడానికి సొంత గ్రామాలకు వెళ్లడంతో హైదరాబాద్ బోసిపోయింది. హైదరాబాద్ నుంచి గత మూడురోజుల్లో 25 లక్షల మంది ఏపీకి వెళ్లినట్లు నిఘా వర్గాలు అంచనావేశాయి. కేవలం 12వ తేదీన ఒక్కరోజులోనే సుమారు 7లక్షల మంది హైదరాబాద్ నుంచి ఏపీ కి వెటళ్తునట్లు తెలుస్తోంది. అలాగే తెలంగాణ జిల్లాల్లోంచి హైదరాబాద్ లో స్థిరపడిన వారు తమ ఓటు హక్కు సొంత ఊర్లలో ఉండటంతో ఊరి బాటపట్టడంతో బస్తీల్లో జనసందడి తగ్గిపోయింది. వరంగల్, ఖమ్మం, కరీంనగర్,మంచిర్యాల,నిర్మల్, సిరిసిల్ల నుంచి అత్యధికంగా ఏపీకి తరలివెళ్లినట్లు సమాచారం. ఏపీలో ఉన్న తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి తరలి వెళ్లారు.

**బస్సుల ఏర్పాటు...**

ఏపీలో పోటీలో ఉన్నఅభ్యర్థుల ప్రతినిధులు గత కొద్ది రోజులుగా హైదరాబాద్‌లో పర్యటించి తమవారిని ఏపీకి తరలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పక్కా సమాచారం. అభ్యర్థుల పక్షాన హైదరాబాద్‌లోఉన్న ఆంధ్రకు చెందిన వలస కూలీలను ఓటు హక్కు వినియోగించుకోవడానికి సొంత ఊర్లకు తరలించారు. ప్రధానంగా కూకట్ పల్లి, బాలానగర్, యూసుఫ్ గూడ, సనత్ నగర్,అమీర్ పేట, కుత్బుల్లా పూర్,,నిజాంపేట్, పటాన్ చెరు, దిల్‌సుఖ్ నగర్ తదితర ప్రాంతాల నుంచి భారీగా ఏపీ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి తరలి వెళ్లడంలో హైదరాబాద్‌లో జనం లేక బోసి పోయింది. సంక్రాంత్రి, దసరాపండుగల వాతావరణం ఒక్కసారిగా ఓట్ల పండుగ రూపంలో దర్శనమిచ్చింది. 2023 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో కోటి 54 లక్షల వాహనాలున్నాయి. ఇందులో అన్నిరకాల ద్విచక్రవాహనాలు 22 లక్షలు, ఆటోలు4.55లక్షలు ఉన్నాయి. స్కూల్ బస్సులు 28వేల 962 ఉన్నాయి. పోలింగ్ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో పాటు అంతకు ముందు శని, ఆది వారాలు రావడంతో స్కూలు విద్యార్థులు, ఉద్యోగులు సొంత ఊర్లకు పయనమయ్యారు. అయితే హైదరాబాద్ లో నిత్యం 10 లక్షల వాహనాల రణగొణ ధ్వనులతో కిక్కిరిసి పోయేరహదారుల్లో వాహనాల ప్రయాణం లేక నిశ్శబ్ద వాతావరణ అలుముకుంది. నిత్యం ఎంతో రద్దీగా ఉండే సచివాలయం, అమీర్ పేట, సికింద్రాబాద్, నాంపల్లి ,నిజాం కళాశాల రోడ్డు, అబిడ్స్, కోఠీ బోసి పోయాయి. సెలవులతో పాటుగా ఎన్నికల కోసం షాపులు, సినిమా థియేటర్లు బంద్ ఉండటంతో ప్రజలు కేవలం ఓటుకోసమే బయటకు వచ్చే పరిస్థితి ఉండటంతో ప్రయాణం సులువు అయింది. నిత్యం జోరుగా హోరుగా సాగే బతుకుపోరు తాత్కాలికంగా విశ్రాంతి తీసుకుంది.

# బీఆర్ఎస్‌కు మంచి ఫలితాలు వస్తాయి : కేటీఆర్



హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో అద్భుతమైన పోరాటపటిమ ప్రదర్శించిన క్షేత్రస్థాయి భారత రాష్ట్ర సమితి శ్రేణులు అందరికీ, పార్టీ నాయకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఎదురుదెబ్బలు ఎన్ని కొట్టావు అన్నది కాకుండా ఎన్ని ఎదురుదెబ్బలు తిన్నా సవాళ్లు ఎదుర్కొనీ తిరిగి నిలబడి పోరాటం చేశామన్నదే ముఖ్యం అని వెల్లడించారు. కష్టపడిన పార్టీ కార్యకర్తలకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన తర్వాత తిరిగి బలంగా నిలబడి కొట్లాడడం ఆషామాషి వ్యవహారం కాదన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అద్భుతమైన నిబద్ధతతో పార్టీ అధ్యక్షులు కేసీఆర్ వెంట నడిచారన్నారు. ఎన్నికల్లో ప్రజామోదం కోసం కొట్లాడిన తీరు అద్భుతం అన్నారు. గత ఐదు నెలలుగా సామాజిక మాధ్యమాల్లో పార్టీ కోసం పని చేసిన, ప్రతి ఒక్క సోషల్ మీడియా వారియర్‌కి కేటీఆర్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తమ పార్టీ సోషల్ మీడియా వారియర్లకు, కార్యకర్తలకు ఇతర పార్టీల మాదిరి ఏలాంటి చెల్లింపులు చేయకుండా పార్టీ మీద తెలంగాణ మీద ప్రేమతో పనిచేశారని కొనియాడారు. కేవలం తెలంగాణ మీద ఉన్న ప్రేమ, కేసీఆర్ పైన ఉన్న అచంచలమైన విశ్వాసంతో తమ పార్టీ కార్యకర్తలు ఈ ఎన్నికల్లో తమ వాణిని బలంగా వినిపించారని, అద్భుతంగా కొట్లాడారన్నారు. తమ పార్టీ శ్రేణులు చేసిన ఈ పోరాటం గొప్ప ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో పాటు తమ వెంట నిలిచిన తెలంగాణ ప్రజలందరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలియజేశారు.

# మా కుటుంబం రాయబరేలికి అంకితం:రాహుల్ గాంధీ



ప్రధాని నరేంద్ర మోడీ అదానీ, అంబానీల ప్రయోజనాల కోసం పనిచేస్తారని, కాని తన కుటుంబం రాయబరేలి ప్రజల కోసం ఎల్లప్పుడూ పనిచేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. రాయబరేలి నియోజకవర్గంలో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం తొలి ఎన్నికల ప్రచార సభలో రాహుల్ ప్రసంగిస్తూ ఇక్కడి ప్రజలతో తన కుటుంబానికి బలమైన సంబంధాలు ఉన్న కారణంగానే తాను రాయబరేలి నుంచి పోటీ చేస్తున్నానని తెలిపారు. దేశంలోని 22 నుంచి 25 మంది పారిశ్రామిక వేత్తల కోసం రూ. 16 లక్షల కోట్ల రుణాలను మోడీ ప్రభుత్వం మాఫీ చేసిందని, ఇది 24 ఏళ్ల పాటు ఉపాధి హామీ పథకం కోసం కేటాయించిన నిధులతో సమానమని ఆయన చెప్పారు. రాయబరేలి ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి తన నాయనమ్మ ఇందిరా గాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ, తల్లి సోనియా గాంధీ పాటుపడ్డారని రాహుల్ తెలిపారు. గాంధీ కుటుంబానికి కంచుకోటగా పరిగణించే రాయబరేలి లోక్‌సభ నియోజకవర్గానికి 2004 నుంచి సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించారు. అంతకుముందు ఈ నియోజకవర్గానికి మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ప్రాతినిధ్యం వహించారు. దేశంలో రైతులు, నిరుద్యోగ యువజనులు ఎదుర్కొంపటన్న సమస్యలను మీడియా చూపించడం లేదని రాహుల్ తన ప్రసంగంలో ఆరోపించారు. వీటికి బదులుగా బడా పారిశ్రామికవెత్తల కుటుంబాలలో జరిగే వివాహ మహోత్సవాలకు మీడియా ప్రాధాన్యం ఇస్తోందని ఆయన విమర్శించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పేద కుటుంబాల లెక్కలు తీసి ఒక్కో కుటుంబానికి ఏడాది రూ. 1 లక్ష చొప్పున లేదా నెలకు రూ. 8,500 చొప్పున వారి బ్యాంకు ఖాతాలు వేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. చిన్న రైతుల రుణాలను కూడా ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మాఫీ చేస్తుందని, రైతుల పంటలకు కనీస గిట్టుబాటు ధరను చట్టబద్ధంగా అందచేస్తుందని ఆయన వాగ్దానం చేశారు. రక్షణ దళాలలో అగ్నివీర్ పథకాన్ని రద్దు చేసి పెన్షన్ సౌకర్యంతో సాయుధ దళాలలో యువతకు శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలలో యువతకు ఏడాదిపాటు అప్రెంటిస్‌షిప్ లభిస్తుందని, అనంతరం వారి ప్రతిభ ప్రాతిపదికన శాశ్వాత ఉద్యోగాలు కల్పిస్తామని ఆయన చెప్పారు. మే 20న ఐదవ దశలో రాయబరేలి లోక్‌సభ నియోజకవర్గానికి పోలింగ్ జరగనున్నది.

## సంపాదకీయం

మంగళవారం, మే 14, 2024

### కూటమిలో కుమ్ములాటలు

కేంద్రంలో అప్రతిహతంగా కొనసాగుతున్న మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి ముగింపు పలకాలన్న ప్రధాన లక్ష్యంతో విపక్షాల సమైక్య 'ఇండియా' కూటమిలో కుమ్ములాటలు కొనసాగుతున్నాయి. సీట్ల సర్దుబాటు నుంచి ప్రచారాల వరకు ఎక్కడో ఒక చోట పొరపొచ్చాలు కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల కూటమి ఒప్పందానికి విరుద్ధంగా కొన్ని పార్టీలు తమ అభ్యర్థులను నేరుగా పోటీలోకి దింపాయి. ఇప్పటికీ పశ్చిమబెంగాల్, ఢిల్లీ, పంజాబ్, కేరళ వంటి రాష్ట్రాల్లో కూటమి ఐక్యత అంతగా కనిపించడం లేదు. జాతీయ స్థాయిలో తామంతా కూటమి లోనే కలిసికట్టుగా ఉన్నామని చెబుతున్నా ఆయా రాష్ట్రాల క్షేత్రస్థాయిలో మాత్రం ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు వ్యవహరిస్తున్నాయి కేరళలోని కూటమి పార్టీల మధ్యనే తీవ్ర పోటీ ఏర్పడడం చర్చనీయాంశం అవుతోంది. కేరళలో సిపిఎం నేతృత్వం లోని లెఫ్ట్ డెమొక్రాటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) వామపక్ష ప్రభుత్వం ఇప్పుడు అధికారంలో ఉంది. అయితే ఇక్కడ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీయే. జాతీయ స్థాయిలో ఈ రెండు పార్టీలు మిత్రపక్షాలు అయినప్పటికీ కేరళలో మాత్రం పోటీపడుతున్నాయి. ముఖ్యంగా కేరళలోని వాయినాడ్ నియోజకవర్గంలో పోరు తీవ్ర స్థాయిలో ఉంది. వాయినాడ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ యునైటెడ్ డెమొక్రాటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) మద్దతుతో పోటీలో ఉండగా, ఎల్‌డిఎఫ్ తరపున సిపిఐ సీనియర్ నాయకురాలు అన్నేరాజా రంగంలో ఉన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కూడా సిపిఐ తరపున పిపి సునీల్ పోటీ చేశారు. బిజెపి అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు కె. సురేంద్రన్ పోటీ చేస్తున్నారు. రాహుల్‌కు వామపక్షాల నుంచే కాకుండా బిజెపి నుంచి కూడా పోటీ తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో లెఫ్ట్ డెమొక్రాటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) అధినేత , ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ అవినీతి ఆరోపణలు చేస్తూ బహిరంగంగా విమర్శిస్తున్నారు. అవినీతి కేసులతో పినరయి విజయన్‌కు ప్రత్యక్షంగా సంబంధాలు ఉన్నట్టు ఎలాంటి రుజువులు లేకపోయినా, ఉన్నట్టు అపోహలు సృష్టిస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) లేదా సిబిఐ పినరయిని అరెస్ట్ చేసి ఎందుకు విచారించడం లేదని ప్రశ్నిస్తున్నారు. తిరువనంతపురం విమానాశ్రయం ద్వారా స్మగ్లింగ్ అయిన బంగారం కేసులో పినరయి విజయన్‌కు సంబంధం ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారు. ఈ స్మగ్లింగ్ కేసు నిందితుల్లో కొందరితో పినరయి విజయన్ మాజీ ప్రైవేట్ సెక్రటరీ, సీనియర్ ఐఎఎస్ అధికారికి సన్నిహిత సంబంధం ఉన్నట్టు కేవలం అనుమానాలే ఉన్నాయి. వీటిని ఆసరా చేసుకుని పినరయిని కేసులో ఇరికించాలన్న ప్రయత్నాలు కూడా జరిగాయి. ఇదే విధంగా విజయన్‌పై వ్యతిరేకంగా యునైటెడ్ డెమొక్రాటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) లోపాలను వెతుకుతోంది. దేశం మొత్తం మీద వామపక్ష పార్టీ నేతల్లో ఎవరి మీదా అవినీతి మచ్చలేదన్నది వాస్తవం. వామపక్షాలతో పోటీ పడడం యుడిఎఫ్‌కు అనివార్యమైనప్పటికీ, యుడిఎఫ్ మద్దతు ఇస్తున్న రాహుల్ పినరయిపై కేంద్ర దర్యాప్తు సంస్థలను అనవసరంగా ఉసి గొలుపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర దర్యాప్తు సంస్థలకి యుడిఎఫ్ అనుకూల వైఖరి ప్రదర్శిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి కాంగ్రెస్‌ను వామపక్షాలకు దూరం చేస్తోంది. ఇది కూటమిలో చీలికకు దారి తీయవచ్చన్న వ్యాఖ్యలు వస్తున్నాయి. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ దర్యాప్తులో ఇడికి వ్యతిరేకంగా మొదటిసారి ఆందోళన సాగినప్పుడు కాంగ్రెస్ పార్టీయే ముందున్నప్పటికీ, తరువాత వెనక్కు తగ్గింది. ఇప్పుడు కేరళలో అదే పరిస్థితి కనిపిస్తోంది. సిపిఐ అభ్యర్థి అన్నేరాజాపై కూడా రాహుల్‌కు మద్దతు ఇస్తున్న పార్టీలు తీవ్ర విమర్శలు చేస్తుండడం, సిపిఐకి ఏం చేయాలో పాలుపోవడం లేదు. కూటమి లక్ష్యాలకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో కొన్ని చోట్ల కూటమిలోని పార్టీల పైనే వ్యతిరేక ప్రచారం సాగించడం కాంగ్రెస్ ద్వంద్వ రాజకీయ వైఖరిని చాటుతోంది. కేరళలో వటకర నియోజక వర్గ సిపిఎం అభ్యర్థిని కెకె శైలజకు మద్దతుగా ఇటీవల ప్రచారం సాగించిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కాంగ్రెస్ వైఖరిని తూర్పార బట్టారు కెకె శైలజపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన ప్రచారం జరుగుతుండడం వెనుక కాంగ్రెస్ మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ప్రోత్సాహం ఉంటోందని సిపిఎం ఆరోపిస్తోంది. దీనిపై ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసింది. వాయినాడ్‌లో ఎల్‌డిఎఫ్ తరపున పోటీలో ఉన్న సిపిఐ అభ్యర్థిని అన్నేరాజాపై కూడా వ్యతిరేక ప్రచారం సాగుతోంది. ఈ వైఖరిని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా కూడా ఆక్షేపించారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను అరెస్టు చేయాలని రాహుల్ డిమాండ్ చేయడాన్ని తప్పుపట్టారు. ఇండియా కూటమికి ఇంకా ప్రధాని అభ్యర్థి ఖరారు కాలేదు. ఈ నేపథ్యంలో రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా ఇండియా కూటమి నిర్ణయించాలనుకుంటే దానికి వామపక్షాలు అంగీకారం తెల్పకపోవచ్చు.

# మన ఓటుకు ఏదీ నైతిక కొలమానం?

ప్రజాస్వామ్యాన్ని ఎన్నికల స్థాయికి దిగజార్చి చాలా కాలం అయ్యింది. ఎంతలా అంటే ప్రపంచవ్యాప్తంగా నియంతలు కూడా ఎన్నికలు అనే ముసుగు వేసుకోడానికి ఆత్రుత పడుతున్నారు. కానీ ఎన్నికలు సక్రమంగా జరిగితే ఓటు వేయడం ఏ విధంగా ప్రజాస్వామ్య ప్రక్రియో ఆలోచించాలి. ఓటు వేయడంలో ఒక ప్రత్యేకమైన వ్యవహారం ఇమిడి ఉంది. ఇందులో ప్రజలు తమకు ఉమ్మడిగా 'స్వంతమైన' దానిని ఇంకొకరి చేతికి ఉద్దేశపూర్వకంగా బదలాయించడం ఉంది. తమను తాము పరిపాలించుకొనడం అనేది ప్రజాస్వామ్యంలో ప్రజల ఉమ్మడి సంపద. ఇందులో ప్రజలందరికి భాగస్వామ్యం ఉంది. ఈ ఉమ్మడి సంపదను నిర్వహించే బాధ్యతను ప్రజలు కొద్దిమంది రాజకీయ నాయకుల చేతిలో ఓటింగ్ ద్వారా పెడతారు. ప్రజాస్వామ్యం అంటేనే ప్రజల తరఫున, వారి స్థానంలో, వారి పరోక్షంలో కొద్దిమంది పాలించేది. ప్రజల తరఫున పాలించడం అంటేనే నిరంకుశత్వానికి అవకాశం ఉందనేది స్పష్టం. అరుదుగా తప్ప ప్రజాస్వామ్యం ఎప్పుడూ ప్రజల చేత నడిపించబడేది కాదు. అంటే మరింత జాగ్రత్తగా ఓటు వేయాలని అర్థం. పుతిన్ కూడా 97శాతం ఓట్లతో ప్రజల తరఫున ఎన్నికయినట్టు ప్రకటించుకున్నాడు. ప్రజలందరికీ మంచి చేసేదే నిజమైన ప్రజాస్వామ్యం అనే మాటను తరుచు వింటుంటాం. కానీ ప్రజలు అనే పదంలో అందరూ అనే అర్థం చరిత్రలో ఎప్పుడూ లేదు. నోరున్నవారి, బలమున్న వారి ప్రయోజనాలే ప్రజల ప్రయోజనాలుగా చలామణి అవుతూ వచ్చింది. బానిసల, కింది కులాల, స్త్రీల, శ్రామికుల ప్రయోజనాలు ప్రజల ప్రయోజనాలుగా చాలా కాలం చలామణి కాలేదు. అయినా ప్రజా ప్రయోజనం అనే మాట చాలా కాలంగా చలామణిలో ఉంది. ప్రజాస్వామ్యంలో పేదల శాతం తీవ్రంగా పడిపోలేదనేది వాస్తవం. ఆ అర్థంలో ఆచరణలో ప్రజాస్వామ్యం 'ప్రజల కొరకు' పనిచేయడం లేదు. 'అందరి ప్రయోజనాలు తీర్చుతాం' అనే వాదనను నియంతృత్వ వ్యవస్థలు కూడా వాడుకుంటాయి. అది ప్రజాస్వామ్య వ్యవస్థలకు ప్రత్యేకం కాదు. కాబట్టి ప్రజాస్వామ్యం అనే మాటను నిజమైన అర్థంలో ఏ రాజకీయ పార్టీ అయినా వాడితే, అది సమాజంలో ఎటువంటి సామాజిక బలం, గొంతు లేని అత్యంత అట్టడుగు వర్గాల ప్రయోజనాలకు ముందు పీట వేసిందా లేదా అనే నైతిక కొలమానాన్ని వెతకాలి. అంటే మెజారిటీ ప్రజల ప్రయోజనాలు అనేది ప్రజాస్వామ్య వ్యవస్థకు కొలమానం కాదని మనం గుర్తించాలి. సమాజంలో బడుగు వర్గాలు పాల్గొన్నంత చురుకుగా సంపన్నులు ఓటింగ్‌లో పాల్గొనరు. పేదలు డబ్బులు, వినియోగ వస్తువుల కోసం ఓట్లు వేస్తారని మధ్యతరగతి అంటుంది. మతపరమైన కారణాల రీత్యా మైనారిటీలు ఓటు వేస్తారని మెజారిటీ వాదులు అంటారు. కులం రీత్యా ఓటు వేసేవారు కూడా బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తున్నారనేది ఇంకొక ఎత్తిపొడుపు. ఈ వాదనలు అన్నీ ఏదో ఒక భావజాల ప్రభావానికి లోనై ఓటు వేసే వారికి కూడా వర్తిస్తుంది. ఇవన్నీ ఓటు వేయడానికి ఒక ప్రత్యేకమైన కారణం ఉందనే విశ్వాసం రీత్యా చేసేవే. ఏదో ఒకటి ఆశించి ఓటు వేయడం ఎప్పుడు ఒక రాజకీయ వ్యవహారమే. ఓటు వేయడం ఎలాంటి బాధ్యత, ఎవరి పట్ల బాధ్యత ప్రతి ఓటరుకు తెలుసు తన ఓటు వేల ఓట్లలో ఒక చిన్న భాగమని, తన ఓటుకు అంతిమ ఫలితానికి మధ్య ప్రత్యక్ష సంబంధం లేదని. ఎన్నికైన ప్రతినిధులు తమ అధికారాన్ని, సంపదను పెంచుకున్నంత కాలం, 'ఓటేస్తే నాకేమొస్తది' అనే వ్యవహారం చాలా సహజం. పాలన వ్యాపారం అయిన తర్వాత, ఓటరు తన ధరను ఎందుకు అడగకూడదు? డబ్బు ఆశించే ఓటర్లు ప్రజాస్వామ్యం 'ప్రజల కొరకు' అనే వాదనలోని డొల్లతనాన్ని ఎత్తి చూపుతున్నారు. సామాజిక సంబంధాలను డబ్బుమయం చేసిన మార్కెట్టు సాధించిన విజయంగా దీన్ని చూడవచ్చు. ఎటొచ్చి, లాభాలను ఆశించే రాజకీయ నాయకుడు ఎన్నికలలో పెట్టుబడి పెట్టడానికి వెనుకాడడం లేదు. ఎన్నికైన ప్రతినిధులు లాభాలు సంపాదించు కుంటుంటే ఓటింగును వ్యాపారంగా ఎందుకు పరిగణించకూడదు? ఆ లాభాల్లో భాగాన్ని ఓటరు ఎందుకు ఆశించకూడదు? తాము చేసే సేవకు (ఓటు వేసే సేవకు) సాధ్యమైనంత లాభం పొందాలని ఒక పేద ఓటరు ఆశిస్తే, అతనిని తప్పు పట్టే నైతిక హక్కు, పన్నులు చెల్లించడం తప్ప తమకు ఏమీ ఒరగదని ఓటు వేయని మధ్య తరగతికి ఉందా? పేద ఓటరును ఆడిపోసుకునే హక్కు రాజకీయ పొలంలో మేసే ధనిక వర్గానికి అసలే లేదు. ఇదంతా ప్రజాస్వామ్యంలో భాగం కాదని మనకు తెలుసు. ప్రజాస్వామ్యాన్ని అత్యంత నిమ్న వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేసేదని నిర్వచిస్తే, ఓటు వేయడాన్ని స్వప్రయోజనం కోసం వేసేదిగా పరిగణించకూడదు. అంటే నేను ఓటు వేసేది నా కంటే ఎక్కువ సమస్యలు ఎదుర్కొంటున్న వారి తరపునే తప్ప నా తరపున కాదు ఈ అర్థంలో మాత్రమే ఓటు వేయడం అనేది ఒక నైతిక, సామాజిక విధి. ఎన్నుకోబడే ప్రతినిధి ప్రజల తరపున ధర్మకర్తగా వ్యవహరించాలి. తమ మీద ఉంచిన విశ్వాసాన్ని ధ్వంసం చేయకూడదు. ప్రజాస్వామ్యానికి ఇది ఒక శక్తివంతమైన అర్థం. ఈ విస్తృతమైన అర్థాన్ని ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఒక సాధనంగా మాత్రమే భావించే వైఖరి ధ్వంసం చేసింది. అందుకే నిజమైన అర్థంలో మన ప్రతినిధి ఎలా పనిచేసాడు అనేది కాక అతను ఏ మేరకు జవాబుదారిగా మెలిగాడు అనేది ప్రజాస్వామ్యానికి కొలమానం. కానీ ఇప్పటికే తాము ఎంతో చేసాం అనేవారైనా, రాబోయే కాలంలో ఎంతో చేస్తాం అనేవారైనా తాము ప్రజలకు జవాబుదారిగా ఇప్పటివరకు ఉన్నారా, ఆ స్వభావం వాళ్ళలో ఉందా అనే విషయం చెప్పడం లేదు. ఈ అంశం ఏ రాజకీయ పార్టీ మేనిఫెస్టోలో లేకపోవడం కొట్టొచ్చేలా కనిపించే అంశం. ప్రజాస్వామిక వ్యవస్థను ధ్వంసం చేసి పేదలకు సంక్షేమాన్ని ప్రకటిస్తున్నారనేది మధ్య తరగతికి రాజకీయాల పట్ల ఉండే ఆక్షేపణ. ప్రజాస్వామ్య వ్యవస్థలుగా చలామణి అయ్యేవి తమ సమస్యలు తీర్చుతాయి అని విశ్వసించే పేదలు ఎవరూ ఈ రోజు లేరు. ఈ వ్యవస్థలు పేదల అవసరాలు తీరే విధంగా రూపొందకపోవడం వెనక మధ్య తరగతి పాత్రా ఉంది. ప్రభుత్వ ఉద్యోగాల పట్ల కింది మధ్య తరగతికి ఉన్న తరగని ఆశ వెనక అధికారం, దాంతో వచ్చే ప్రయోజనాల పట్ల చర్చ బాహాటంగానే జరగడం చూస్తాం. కులాన్ని, మతాన్ని, డబ్బును ఎరగా వేసి ఉద్యోగాలు సంపాదించే ప్రయత్నాలు చేసేవాళ్ళు ప్రజలకు సేవ చేయడానికి చేయడం కాదు. కానీ ఈ వ్యవస్థలు ఎంతగా పేదలకు వ్యతిరేకంగా పనిచేస్తే, సమస్యల్లో ఉన్న ప్రజలు అంతగా వీటిని ధ్వసం చేసైనా తమకు న్యాయం చేస్తాననే మాయచేసే నియంతలను ఎన్నుకోడానికి సిద్ధపడతారు. బలమైన నాయకుడు అనే భావన వెనక, తమ పురోగతికి అడ్డుపడే వ్యవస్థల కన్నా బలమైన నాయకుడు అనే భావన అంతర్లీనంగా ఉంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థల ఫలాలను కింది వర్గాల దాకా రాకుండా చేస్తే జరిగే పరిణామాలు ప్రపంచ వ్యాప్తంగా నియంతలు ఎన్నిక కావడంలో చూడవచ్చు. ప్రజాస్వామ్యానికి వస్తున్న ముప్పు గురించి వగచే మధ్యతరగతి ప్రజాస్వామ్యం పరిధిని విస్తృతం చేయడం ద్వారా మాత్రమే ఎదుర్కోగలదు. తమకు పనిచేయని ప్రజాస్వామ్యాన్ని మేమెందుకు కాపాడాలి అనే శ్రామిక వర్గం ప్రశ్నకు మధ్యతరగతి దగ్గర సమాధానం





లేదు. నమ్మకం అనే నైతిక విలువ లేకుండా ప్రజాస్వామ్య పునాదులు ఉండవు. వివక్షకు తావులేకుండా, న్యాయబద్ధంగా మనకు ప్రాతినిధ్యం వహిస్తాడు అనే నమ్మకం మీద ఆధారపడి మనం ఓటు వేయగలగాలి. మనుషుల మధ్య సంబంధాలను కలిపేది గుణాత్మకమైన ఈ విశ్వాసమే. అందుకే విశ్వాస ఘాతుకమే అన్నిటికంటే హీనమైనది. ఈ విశ్వాసం ఒక ఆదర్శం మాత్రమే కాదు, ఒక ఆచరణా మార్గం కూడా. నిత్య జీవితంలో మనం ఆందోళన చెందకుండా జీవించాలంటే మన చుట్టూ ఉన్నవారు తాము చేయాల్సిన పని చేస్తారనే నమ్మకం కలగాలి. సామాజికంగా తమకన్నా దిగువన ఉన్నవారి కోసం తాము వేసే ఓటులో ఈ నైతిక కర్తవ్యాన్ని మధ్య తరగతి గుర్తెరగాలి. ఇతర వర్గాల అభివృద్ధికి హామీ పడే పార్టీకి ఓటు వేయడంలో రాజ్యాంగ విలువైన సౌభ్రాతృత్వానికి ప్రాణం పోసే పాత్రను ప్రతి ఒక్కరు పోషించవచ్చు. మొత్తం సమాజం తరపున ధర్మ కర్తృత్వం వహించవచ్చు. వర్గాలకు అతీతంగా 'భారతీయ ప్రజలమైన మేము' అనే అమాయకమైన రాజ్యాంగ భావనకు ప్రాణం పోయవచ్చు. రాజకీయ ప్రజాస్వామ్యంలో ప్రజలందరికీ సమాన అధికారం అనేది అమాయకమైన విషయమే. కానీ, అది కొద్దిగానైనా సాకారం కావాలంటే అధికారం చెలాయించే వాళ్లలో విశ్వాసం, ధర్మ కర్తృత్వం, జవాబుదారీతనం అనే విలువలు చాలా అవసరం. మనమున్నది ఆదర్శాలకు కాలం కానీ మాట నిజమే. కానీ ఓటు ద్వారా అధికార వ్యవస్థలను సృష్టించే వర్గాలు, ముఖ్యంగా మధ్య తరగతిలోనే ఈ ఆదర్శాలు కొద్దిగానైనా లేకపోతే, ఇక రాజ్య వ్యవస్థలో వాటిని ఆశించలేం.


## రుణమాఫీపై ఆశలు

పెద్దపల్లి : ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీలోపు రెండు లక్షల రూపాయల వరకు పంట రుణాల మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. దీంతో జిల్లాలో 700 నుంచి 750 కోట్ల రూపాయల వరకు మాఫీ అయ్యే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున దీనికి సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ఇంకా రూపొందించలేదు. ఎప్పటినుంచి ఎప్పటివరకు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తారు, గతంలో రుణ మాఫీకి అర్హత పొంది, డబ్బులు రానటువంటి రైతులకు కూడా మాఫీ చేస్తారా, లేదా అనే విషయం తెలియడం లేదు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే డిసెంబర్ 9వ తేదీ నుంచే ఆరు గ్యారంటీ పథకాలతో పాటు పలు పథకాలను, 2 లక్షల రూపాయల వరకు పంట రుణ మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో మెజారిటీ సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ డిసెంబర్ 7వ తేదీన అధికారం చేపట్టింది. కానీ రుణమాఫీ చేయలేదు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, రూ. 500కే వంట గ్యాస్, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యాన్ని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచారు. 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను వినియోగించే వాళ్లకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఒక్కో నియోజవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు కేటాయించగా, లబ్ధిదారులను ఎంపిక చేసే లోపే ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. ఇంకా మహిళలకు నెలకు రూ. 2,500 ఇవ్వడం, రైతు భరోసా ద్వారా రైతులు, కౌలు రైతులకు ఏడాదికి ఎకరానికి రూ. 15 వేలు ఇవ్వడం, వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలు ఇవ్వడం, 2లక్షల రుణ మాఫీ, పింఛన్ల పెంపు, యువ వికాసం పథకాలను అమలుచేయలేదు. అయితే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మాత్రం రైతులకు 2 లక్షల రూపాయల వరకు ఆగస్టు 15వ తేదీలోపు రుణ మాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ అంశాన్ని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సీఎం నుంచి మొదలుకుని మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకుల వరకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గత ప్రభుత్వం కూడా ఎన్నికల సందర్భంగా లక్ష రూపాయల వరకు రుణ మాఫీ చేస్తామని, నాలుగు విడతల్లో డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించింది. నాలుగేళ్లలో 25వేల వరకు రుణాలు పొందిన వారి రుణాలనే మాఫీ చేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మిగతా మంది రైతులకు డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించింది. కానీ అందరు రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేయలేదు.

## అంతు చిక్కని ఓటరు నాడి



జగిత్యాల: పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతు న్నప్పటికీ ఓటర్ల నాడీ అంతుచిక్కక ప్రదాన రాజకీయ పక్షాలు, అభ్యర్థు లు మల్లగుల్లాలు పడుతున్నారు. ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో తె లియక పోవడం, క్షేత్ర స్థాయిలో పరిస్థితి అర్థం కాకపోవడంతో నిజా మాబాద్ పార్లమెంట్ పరిధిలో బరిలోకి దిగిన మూడు ప్రధాన పార్టీల్లో ఎవరు గెలుస్తారానే దానిపై ఇప్పటికి ఒక స్పష్టత రావడం లేదు. ప్రస్తుత పరిస్థితులు మాత్రం బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య టఫ్ ఫైట్ నడు స్తున్నట్లు కనిపిస్తోంది. కానీ ఈ పార్టీలో ఎవరి వైపు ఓటర్లు మొగ్గు చూపే అవకాశాలున్నాయో తేలడం లేదు. రోజురోజుకు పోలింగ్ గడువు సమీపిస్తుండడంతో ఓట్ల కోసం వేట ముమ్మరం చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్ లతో పాటు బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోదన్ సెగ్మెంట్‌లలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు ఎన్ని కలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచార పర్వంలో దూసుకుపోతున్నా యి. ఒక వైపు ఓటర్ల నాడిని పసిగట్టడానికి ప్రయత్నిస్తూ..మరో వైపు ప్ర చార అస్త్రాలకు పదును పెడుతున్నాయి. ఈ సమయంలో ఓటర్ల నాడిని అంచనా వేయడంలో ప్రధాన రాజకీయ పక్షాలు ముప్పు తిప్పలు పడుతున్నాయి. తటస్థ, వలస ఓటర్లకు గాలం వేసేందుకు ఎత్తులకు పైఎత్తు వేస్తున్నా రు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ తదితర పట్టణాలకు బతుకు దెరువు కోసం వెళ్లిన కుటుంబాలను కలుస్తూ...ఓటింగ్ రోజు స్వగ్రామాల కు వచ్చేలా ప్రణాళిక చేస్తున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు చెందిన సుమారు 30 వేల పైచిలుకు ఓటర్లు బతుకు దెరువు కోసం ప ట్టణాలకు వలస వెళ్లారన్న అంచనా ఉంది. జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాలకు చెందిన పలువురు ఓటర్లు మహారాష్ట్రలోని ముంబాయి, బీ వండి, పుణే, హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాల్లో నివసి స్తున్నారు. భవన నిర్మాణ రంగం, బార్, రెస్టారెంట్, రోజువారి కూలీ, అవు ట్ సోర్సింగ్, ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు. పలు వురు యువతీ యువకులు ఉన్నత విద్య, ఉద్యోగ అవసరాల నిమిత్తం హైద్రాబాద్, సికింద్రాబాద్, ముంబాయి, బెంగుళూరు ప్రాంతాల్లో ఉం టున్నారు. ఓట్ల సమయంలో స్వగ్రామానికి వస్తారు. వీరిని ప్రసన్నం చే సుకోవడానికి అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. పట్టణం నుంచి పల్లె వరకు కేడర్‌ను తమ పార్టీలో చేర్చురునేలా ప్ర ణాళిక చేస్తూ...ఎదుటి పార్టీకి ఝలక్ ఇస్తున్నారు. పోలింగ్‌కు మరో వారం రోజుల గడువు మాత్రమే ఉండగా...చేరికలకు మరింత పదును పెట్టారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. రానున్న గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని క్షేత్ర స్థాయిలోని లీడర్లు అధికార కాంగ్రెస్‌పార్టీలో చేరుతు న్నా రు. దీనికి తోడు రాష్ట్రంలో అధికారంలో ఉండడం వల్ల ముమ్ముందు నా మినేటేడ్ పోస్టుల భర్తీలో, కాంట్రాక్టు పనులు, ఇతర వ్యవహారాల్లో అవకా శాలు దక్కుతాయన్న ఆశతో పలువురు నేతలు, కార్యకర్తలు, కుల సంఘా ల నేతలు కాంగ్రెస్‌లో చేరడానికి ఆసక్తిని చూపుతున్నారు. మరికొందరు తమ అక్రమ వ్యవహారాలను చక్కబెట్టుకోవడానికి, గతంలో చేసిన అక్ర మాలు బయటకు రాకుండా ఉండడానికి జాగ్రత్త పడుతూ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఆరు గ్యారెంటీల పథకాలతో ప్రజలను ప్రసన్నం చేసుకునే పనిలో అ ధికార కాంగ్రెస్ బరిలో నిలువగా, ప్రత్యేక రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ పథకం అందించామని బీఆర్‌ఎస్...తెలంగాణలో జరిగిన ప్రతీ పనిలో కేంద్రం వాటా ఉందంటూ బీజేపీ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఉ ద్యోగులు, వ్యాపారులు, యువకులు, కుల సంఘాల ఓట్లు కీలకంగా మారనున్నాయి. గెలుపులో ప్రతీ ఓటు కీలకంగా మారనున్న నేపథ్యంలో పార్టీలు ఒక్కరిని కూడా వదలడం లేదు. పార్టీలకు అతీతంగా ఉన్న ఓట్లను తమ వైపు తిప్పుకునేందుకు అనుకూలంగా ఉన్న వారితో సంప్రదింపులు జరుపుతూ ఓటింగ్ శాతం పెంచుకునేలా అన్ని పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి. జిల్లాలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు ప్రచారంలో పైచేయి సా ధించే విధంగా జనసమీకరణ చేస్తున్నారు. రాష్ట్ర పార్టీ అధినాయకత్వం, ముఖ్యనేతలను రంగంలోకి దింపుతూ ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లతో గె లుపే లక్ష్యంగా దూసుకుపోతున్నారు. ఈ మూడు పార్టీల సంగతి ఇలా ఉంటే....కొందరు స్వతంత్ర అభ్యర్థులు, చిన్నా చితక పార్టీలు సైతం ప్ర చారంలో ముందుకు సాగుతున్నారు. వార్డు, పోలింగ్ బూత్ స్థాయిలో ప్ర చారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. ప్రచారంలో ఎక్కువ మంది కార్యకర్త లు, జనం కనిపించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఎంపీ అభ్యర్థుల తరపున పార్టీలోని ముఖ్యులు గ్రామాల వారీగా పలు సామాజిక వర్గాలకు చెందిన ఓట్లను గంపగుత్తగా తమ వైపు తిప్పుకునేం దుకు అష్టకష్టాలు పడుతున్నారు.



# డేట్స్ ఖాళీ లేవు!

కన్నడ సోయగం రష్మిక మందన్న తారాపథంలో దూసుకుపోతున్నది. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో వరుసగా భారీ సినిమాలతో బిజీబిజీగా మారింది. మరో ఏడాది పాటు ఈ అమ్మడి డేట్స్ ఖాళీ లేవు అంటున్నారు. ప్రస్తుతం రష్మిక చేతిలో ఆరు సినిమాలున్నాయి. వీటి షూటింగ్స్ మొత్తం పూర్తి కావడానికి ఏడాదికిపైగా సమయం పడుతుందంటున్నారు. దాంతో ఈ భామ డేట్స్ కావాలంటే మరో ఏడాది పాటు ఆగాల్సిందే. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో పుష్ప2, రెయిన్‌బో, గర్ల్‌ఫ్రెండ్, కుబేర చిత్రాల్లో నటిస్తున్నది. 'పుష్ప2' చిత్రీకరణ తుదిదశకు చేరుకోగా..మిగిలిన మూడు చిత్రాలు షూటింగ్స్ జరుపుకుంటున్నాయి. ఇక బాలీవుడ్‌లో 'యానిమల్' బ్లాక్‌బస్టర్ విజయంతో ఈ సొగసరికి అవకాశాలు వెల్లువెత్తున్నాయి. 'సికిందర్' సినిమాలో సల్మాన్‌ఖాన్‌తో జోడీ కట్టబోతున్నది. విక్కీకౌశల్‌తో 'ఛావా' సినిమాలో నటిస్తున్నది. హిందీలో మరికొన్ని ఆఫర్లొచ్చినా.. డేట్స్ ఖాళీలేని కారణంగా రష్మిక అంగీకరించలేదని అంటున్నారు. మొత్తంగా చూస్తే మరో ఏడాది పాటు రష్మిక మందన్న డేట్స్ దొరకడం కష్టమేనని ఫిల్మ్‌సర్కిల్స్‌లో వినిపిస్తున్నది.



## హత్య కేసు పరిశోధనలో..

'ఆర్.ఎక్స్ 100' 'మంగళవారం' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది పాయల్ రాజ్‌పుత్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'రక్షణ'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో ప్రణదీప్ ఠాకూర్ తెరకెక్కిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. 'క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ కథాంశమిది. పాయల్ రాజ్‌పుత్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుంది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఆమె పాత్ర సాగుతుంది. ఒక హత్యా నేరానికి సంబంధించిన పరిశోధనలో ఎలాంటి మలుపులు చోటుచేసుకున్నాయనేది ఆసక్తిని రేకెత్తిస్తుంది. నటిగా పాయల్ రాజ్‌పుత్‌కు కొత్త ఇమేజ్‌ను తీసుకొచ్చే చిత్రమిది' అని దర్శకుడు తెలిపారు. రోషన్, మానస్, రాజీవ్ కనకాల, వినోద్‌బాల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అనిల్ బండారి, సంగీతం: మహతి స్వరసాగర్, నిర్మాతలు: ప్రకాష్ జోసెఫ్, రమేష్ రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్: శరద్‌వాఘ్రే, నిర్మాణం, దర్శకత్వం: ప్రణదీప్ ఠాకూర్.

## ఓటీటీలోకి.. జర హట్కే జర బచ్కే

బాలీవుడ్ నటులు విక్కీ కౌశల్, సారా అలీఖాన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జర హట్కే జర బచ్కే'. ఫ్యామిలీ డ్రామాగా వచ్చిన ఈ సినిమాను లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించగా.. జియో స్టూడియోస్‌తో కలిసి మ్యాడాక్ ఫిలింస్ నిర్మించింది. గతేడాది జూన్ 02న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ అందుకుంది. కేవలం రూ.40కోట్లతో నిర్మించిన ఈ చిత్రం రూ.115 కోట్లు వసూళ్లను రాబట్టింది. కొత్తగా పెళ్ళైన దంపతులు వైవాహిక జీవితం కోసం కుటుంబం నుంచి విడిపోయేందుకు చేసే ప్రయత్నాలే ఈ సినిమా కథ. అయితే ఈ సినిమా విడుదలై 11 నెలలు అవుతున్న ఇప్పటివరకు ఓటీటీలోకి రాలేదు. ప్రేక్షకులు ఎప్పుడు ఈ సినిమా చూద్దామన్నా నిరాశే ఎదురయ్యింది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీకి సంబంధించి ఓటీటీ అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ ఓటీటీ వేదిక జియో సినిమా ఈ సినిమాను మే 17 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ సినిమాను హిందీలోనే కాకుండా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు జియో సినిమా ప్రకటించింది.

